www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,70306545

సంపుటి - 2 సంచిక -175 గురువారం 05 సెప్టెంబర్ 2024 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -4 వెల - 3/-
Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# విద్యుత్ ఉత్పత్తిని పెంచేలా యాక్షన్ ప్లాన్

- ప్లాన్ అటవీ భూముల్లోనూ సోలార్ విద్యుత్ ఉత్పత్తికి చర్యలు
- రైతులకు వంట గ్యాస్ బదులు సోలార్ సిలిండర్లు, సోలార్ పంప్‌సెట్లు ఇవ్వండి
- కొండారెడ్డిపల్లినే పైలెట్ ప్రాజెక్టుగా తీసుకోండి
- ఒక్క నిమిషం కూడా విద్యుత్ సరఫరా ఆగదనే విశ్వాసం ప్రజల్లో కల్పించండి
- విద్యుత్ శాఖపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు



2లో.

# మేడారంలో సుడిగాలులు



- సుడిగాలులకు నేలకూలిన లక్ష వృక్షాలు
- 200 హెక్టార్లలో నేలకూలిన చెట్లు
- వేర్లతో సహా నేలకొరిగిన 50 వేల చెట్లు
- అడవిని పరిశీలించిన పీసీసీఎఫ్ డోబ్రియాల్
- నిపుణులతో చర్చించి ప్రభుత్వానికి నివేదిక

టోర్నడో తరహాలో వీచిన గాలులు

2లో.

# ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత జగన్ మృతి

- హన్మకొండ జిల్లా టేకులగూడెం జగన్ స్వస్థలం
- స్వగ్రామంలో విషాదఛాయలు
- జగన్‌పై రూ.25లక్షల రివార్డు
- ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్ మృతుల వివరాలు వెల్లడి



హైదరాబాద్/ఖాజీపేట సెప్టెంబర్ 04ప్రజావినికిడి:
మావోయిస్ట్ అగ్రనేత, మొదటి తరం నాయకుడు మాచర్ల ఏసోబ్ అలియాస్ జగన్ అలియాస్ దాదా రణదేవ్ మృతి చెందినట్టుగా పోలీస్ వర్గాలు చెబుతున్నాయి. కేంద్ర కమిటీ సభ్యుడుగా, సెంట్రల్ ఆర్మీ ఇంచార్జ్‌గా, మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ఇంఛార్జ్‌గా ఉన్న ఆయన మృతి చెందినట్లు సమాచారం. ఏసోబ్ హనుమకొండ జిల్లా వాసి అని ఛత్తీస్‌గడ్ పోలీస్ అధికారులు చెబుతున్నట్టు సమాచారం. మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో అతడు మృతి చెందాడని దంతేవాడ పోలీసులు చెబుతున్నారు. రణదేవ్ భార్య మాచర్ల లక్ష్మక్క గతేడాది అనారోగ్యంతో మృతి చెందింది. రణదేవ్‌కు ముగ్గురు పిల్లలు ఉన్నారు. రణదేవ్ మృతితో ఆయన స్వస్థలంలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి.

కాగా ఆయన మరణంపై మావోయిస్ట్ పార్టీ అధికారికంగా ఇంతవరకు ఎలాంటి ప్రకటనా విడుదల చేయ లేదు. మాచర్ల ఏసోబ్ మరణించారంటూ వస్తున్న వార్తలతో ఆయన స్వగ్రామం విషాదం అలుముకుంది. కాగా మంగళవారం ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయి స్టులకు భారీ ప్రాణ నష్టం జరిగిన విషయం విదితమే. ఈ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన కేంద్ర కమిటీ సభ్యుడు మాచర్ల ఏసోబ్‌పై రూ.25 లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఎన్‌కౌంటర్‌తో మొత్తం 9 మంది చనిపోయారు. మృతుల పేరు, రివార్డు వివరాలను పోలీసులు ప్రకటించారు.

# 'హైడ్రా'పై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆసక్తికర వ్యాఖ్యలు

- బుడమేరు గురించి మాట్లాడుతూ హైడ్రా ప్రస్తావన తెచ్చిన పవన్
- హైడ్రాతో సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్నది రైటేనని వెల్లడి

విజయవాడ,సెప్టెంబర్ 04ప్రజావినికిడి:
ఇటీవల కాలంలో ఎక్కువగా వినిపిస్తున్న పేరు హైడ్రా. హైదరాబాదులో అక్రమ నిర్మాణాల అంతు తేల్చుతున్న ఈ వ్యవస్థ, కబ్జాదారుల పాలిట సింహస్వప్నంలా మారింది. తాజాగా, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విజయవాడ వరదలకు కారణమైన బుడమేరు గురించి మాట్లాడుతూ హైడ్రా ప్రస్తావన తీసుకువచ్చారు. "బుడమేరు పరీవాహక ప్రాంతం అంతా ఇళ్లు కట్టేశారు. ఈ విషయంలో సంబంధింత యంత్రాంగానికి, మున్సిపాలిటీకి, పంచాయతీలకు రెస్పాన్సిబిలిటీ ఉంది. హైడ్రా వంటి వ్యవస్థను తీసుకువచ్చి వీటన్నింటినీ తొలగించవచ్చు. కానీ కొన్ని సమస్యలు వస్తాయి. హైదరాబాద్ లో చెరువులు, నదీ పరీవాహక ప్రాంతాల్లో ఇళ్లు కట్టడం చూశాను. ఇబ్బందులు రావా అనుకునేవాడ్ని! అన్నీ కట్టేసిన తర్వాత కూల్చేయడం కాదు... ఇలాంటి వాటిని ముందే నివారించేలా చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా అధికారులు వాళ్ల బాధ్యతను వాళ్లు నిర్వర్తించాలి. ఇప్పుడు రేవంత్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా వచ్చాక అక్రమ నిర్మాణాలను కూలగొట్టే స్తామంటున్నారు. ఆయన చేస్తున్నది రైటే. అయితే మనం కూడా ఇలాగే



వ్యవహరించాలంటే... అనేక సామాజిక సమస్యలు, సామాజిక ఉద్రిక్తతలు తలెత్తే అవకాశం ఉంది. దీని గురించి ఆలోచించాల్సిన అవసరం ఉంది" అని పవన్ కల్యాణ్ వివరించారు.

# తెలుగు రాష్ట్రాల్లో ఏరియల్ సర్వే నిర్వహించాలి

## అమిత్ షాకు కిషన్ రెడ్డి, బండి సంజయ్ విజ్ఞప్తి



- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు విజ్ఞప్తి చేసిన తెలంగాణ నేతలు
- ఈరోజు అధికారిక ప్రకటన వెలువడే అవకాశం


2లో.

# వరద బాధితులకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీల నెల జీతం విరాళం

- వరద బాధితులను ఆదుకోవాలని కేసీఆర్ నిర్ణయించారన్న హరీశ్ రావు
- సర్వం కోల్పోయిన ప్రజలకు అండగా నిలవాలని నిర్ణయించినట్లు వెల్లడి
- బాధితులను ఆదుకోవడానికి ప్రజలు ముందుకు రావాలని సూచన



హైదరాబాద్: సెప్టెంబర్ 04ప్రజావినికిడి:
రాష్ట్రంలో వరద బాధితులకు బీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు విరాళం ప్రకటించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రకటించారు. వరద బాధితులను ఆదుకోవాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారని, అందులో భాగంగా తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు ఒక నెల వేతనాన్ని విరాళంగా ఇవ్వాలని నిర్ణయించామన్నారు.
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వరదల వల్ల సర్వం కోల్పోయి ఇబ్బందిపడుతున్న ప్రజలకు అండగా నిలవాలని, ఇప్పటికే బీఆర్ఎస్ పక్షాన సహాయక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దీనికి తోడుగా బీఆర్ఎస్ శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, పార్లమెంట్ సభ్యుల ఒక నెల జీతాన్ని వారికి అందించనున్నామన్నారు.ప్రజల కష్టాల్లో తోడుండే బీఆర్ఎస్ పార్టీ.... ఇప్పుడు కూడా విలయం సృష్టించిన విపత్తులో ప్రజలతో ప్రజల పక్షాన నిలబడిందన్నారు. వరద బాధితులను ఆదుకునేందుకు ప్రజలందరూ ముందుకు రావాలని మాజీ మంత్రి విజ్ఞప్తి చేశారు.




# హైడ్రా పేరుతో డబ్బులు వసూలు చేస్తే సమాచారం ఇవ్వండి : ఏసీబీ

- పాత నోటీసులు చూపించి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు
- పలుచోట్ల బాధితులు ఫిర్యాదులు డబ్బులు డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచన

2లో.

# గురువులకే గురువు సర్వేపల్లి..



**వృత్తి రీత్యా, వ్యక్తిత్వ రీత్యా, సంస్కార రీత్యా సర్వేపల్లి మహోన్నతుడు. పువ్వ పుట్టగానే పరిమళిస్తుందన్నట్టు చిన్నతనం నుంచి అసాధారణ ప్ర పాటవాలను ప్రదర్శించిన డాక్టర్ సర్వేపల్లి.. స్వశక్తితో ఉన్నత శిఖరాలకు ఎదిగి పలువురికి మార్గదర్శకంగా, తన వృత్తి ధర్మానికి మకుటంగా వెలిగారు. గురువులకే గురువుగా ఉపాధ్యాయవృత్తికే ఆదర్శంగా నిలిచిన ఆయన.. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని ఓ తెలుగు కుటుంబంలో జన్మించారు. విద్యార్థికి, ఉపాధ్యాయుడికీ మధ్య సంబంధం ఎలా ఉండాలో విడమరిచి చెప్పారు ఆచార్య రాధాకృష్ణ.ఉపాధ్యాయవృత్తికే ఆదర్శంగా నిలిచిన ఆచార్యులు సర్వేపల్లి రాధాకృష్ణన్. ఆయన తెలుగు వారు కావడం మనందరికీ గర్వకారణం. ఆయన పుట్టిన రోజైన సెప్టెంబర్ 5న ఏటా ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకొంటున్నాం. ఆయన నాలుగు దశాబ్దాల పాటు ఉపాధ్యా వృత్తిలో ఉండి విద్యార్థుల మధ్యనే గడిపారు. ఎదుటివారికి బోధించటం వల్ల తన విజ్ఞానం కూడా వృద్ధి చెందుతుందని మనసా వాచా నమ్మిన వ్యక్తి సర్వేపల్లి. కష్టమైన అంశాన్ని కూడా విద్యార్థులకు అతి సులభంగా బోధించేవారాయన. ఉపాధ్యాయుడి బాధ్యత ఎప్పుడూ గురుతరమైనదే. అలాంటి బోధనావృత్తికి తలమానికంగా నిలిచిన సర్వేపల్లి గురించి క్లుప్తంగా..**

హైదరాబాద్: సెప్టెంబర్ 04ప్రజావినికిడి:
సర్వేపల్లి రాధాకృష్ణన్ 1888 సెప్టెంబర్ 5న మద్రాసుకు ఈశాన్యంగా 64 కి.మీ. దూరంలోని తిరుత్తణిలో జన్మించారు. ఇది తిరుపతి సమీపంలో ఉంది. ఆయన తల్లిదండ్రులు సర్వేపల్లి వీరస్వామి, సీతమ్మ. వీరాస్వామి నాటి జమీందారీ వద్ద తహసిల్దార్‌గా పనిచేసేవారు. వీరి మాతృభాష తెలుగు. సర్వేపల్లి బాల్యం, పాఠశాల విద్యాభ్యాసం తిరుత్తణి, తిరుపతిలోనే గడిచిపోయాయి.

ప్రాథమిక విద్య తిరుత్తణిలో పూర్తి చేసిన రాధాకృష్ణన్.. తిరుపతి, నెల్లూరులో తదనంతర విద్యాభ్యాసం సాగించారు. మద్రాసు క్రిస్టియన్ కాలేజీ నుంచి ఎంఏ పట్టా పొందారు. 1906లో తన 16వ ఏట సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు శివకామేశ్వరితో వివాహం జరిగింది. వీరికి ఐదుగురు కుమార్తెలు, ఒక కుమారుడు. ఆయన సతీమణి 1956లో తన 51వ ఏట మరణించారు. రాధాకృష్ణన్ బాల్యం నుంచే అసాధారణమైన తెలివితేటలు కనబరిచేవారు. ఆయన తెలివితేటలకు ఉపాధ్యాయులు ముగ్ధులయ్యేవారు.

విద్యార్థికి, ఉపాధ్యాయుడికీ మధ్య సంబంధం ఎలా ఉండాలో విడమరిచి చెప్పారు ఆచార్య రాధాకృష్ణ. అధ్యాపకుడిగా, వైస్ ఛాన్సలర్‌గా, దౌత్యవేత్తగా, ఉప రాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా ఆయన సేవలు నిరుపమానం, అనితరసాధ్యం. ఆయన అధిరోహించిన శిఖరాలు ఆయన జీవితంలోని అసాధారణ కోణాలను మనకు వెల్లడి చేస్తాయి.

సర్వేపల్లి 21 ఏళ్ల వయస్సులోనే మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో అధ్యాపకుడిగా పనిచేశారు. తత్వశాస్త్రంలో ఆయన ప్రతిభను గుర్తించిన మైసూరు విశ్వవిద్యాలయం ఆయన్ని ప్రొఫెసర్‌గా ఆహ్వానించింది. ఆయన ఉపన్యాసాలు విద్యార్థులనెంతో ఆకట్టుకునే.

సర్వేపల్లి ప్రతిభ గుర్తించిన డాక్టర్ అశుతోష్ ముఖర్జీ, రవీంద్రనాథ టాగూర్.. కలకత్తా విశ్వవిద్యాలయ ఆచార్య పదవి చేపట్టమని ఆయణ్ని కోరారు. వారి ఆహ్వానం మేరకు ఆయన అక్కడికి వెళ్లారు. అక్కడే ఆయన కీర్తి దశదిశలా వ్యాపించింది.

కలకత్తా విశ్వవిద్యాలయంలో ఆచార్యుడుగా ఉన్న సమయంలో సర్వేపల్లి 'భారతీయ తత్వశాస్త్రం' అనే గ్రంథం రాశారు. ఆ గ్రంథం విదేశీ పండితుల ప్రశంసలు అందుకుంది. 'మీరు ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ తీసుకుని ఉంటే మీకు ఇంకా మరింత గొప్ప పేరు వచ్చేది' అని ఒక మిత్రుడు అనగా.. సర్వేపల్లి 'నేను ఆక్స్‌ఫర్డ్ వెళ్తే.. అధ్యాపకుడిగా మాత్రమే వెళ్తా. విద్యార్థిగా మాత్రం కాదు' అన్నారట. సర్వేపల్లి దేశభక్తి, స్వదేశీ విద్యాలయాలపట్ల గౌరవం, ఆత్మాభిమానానికి ఈ ఘటనను మచ్చుతునకగా పేర్కొంటారు.

ఆ తర్వాత ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం ఆహ్వానం మేరకు సర్వేపల్లి ప్రాచ్య తత్వశాస్త్రంపై ఉపన్యాసాలిచ్చేందుకు అక్కడికి వెళ్లారు. ఇంగ్లండ్, ఫ్రాన్స్, అమెరికా లాంటి విదేశాల్లో ఉపన్యాసాలు ఇచ్చి మాతృదేశ కీర్తిని పెంచిన ఘనత కూడా ఆయనదే.

1931లో డా. సి.ఆర్. రెడ్డి తర్వాత రాధాకృష్ణన్ ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లరుగా పనిచేశారు. 1931లోనే రాధాకృష్ణన్ 'లీగ్ ఆఫ్ నేషన్స్ ఇంటలెక్చ్యుయల్ కో-ఆపరేషన్ కమిటీ' సభ్యులుగా ఎన్నికయ్యారు. 1936లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ప్రాచ్యమతాల గౌరవాధ్యాపకులుగా పనిచేశారు. 1946లో సర్వేపల్లి భారత రాజ్యాంగ పరిషత్ సభ్యులుగా కీలక పాత్ర పోషించారు. 1947 ఆగస్టు 14, 15 తేదీ మధ్య రాత్రి 'స్వాతంత్ర్యోదయం' సందర్భాన శ్రీ రాధాకృష్ణన్ చేసిన ప్రసంగం భారతీయులను ఎంతో ఉత్తేజపరిచింది.

1ప్రపంచంలోని అనేక విశ్వవిద్యాలయాలు సర్వేపల్లిని గౌరవ డాక్టరేట్లతో సత్కరించాయి. 1969లో భారత ప్రభుత్వం 'భారతరత్న'తో సత్కరించింది.

1967లో రాష్ట్రపతి పదవీ విరమణ చేసిన తర్వాత డాక్టర్ సర్వేపల్లి మద్రాసులోని తన సొంత ఇంటికి వెళ్లిపోయారు. చివరి రోజుల్లో తాత్విక చింతన చేస్తూ గడిపారు. 1975 ఏప్రిల్ 17న ఆయన తుదిశ్వాస విడిచారు.

మతం కాలానుగుణంగా మార్పు చెందుతుందన్న విషయం మరచిపోరాదని రాధాకృష్ణన్ అనేవారు. ఉపనిషత్తుల ఉపదేశాలు, బుద్ధుడి బోధనలు, గీతా సందేశం ప్రాతిపదికగా జాతీయ జీవనాన్ని తిరిగి నిర్మించుకోవాలని సందేశం ఇచ్చారు. సమాజంలో పండితులేగాని నిజమైన తత్వవేత్తలు కనిపించడం లేదని, సృజనాత్మకత కొరవడిందని సర్వేపల్లి ఆవేదన వ్యక్తం చేసేవారు. వారసత్వ సంపద ఎవరినీ మానసిక దాస్యానికి గురిచేయకూడదని మన మహర్షులు కూడా హితవు పలికారని..

అలా వారు నూతన సత్యాలు కనుగొనడానికి, అలాంటి పరిష్కారాలనే సూచించడానికి ఆసక్తి కనబరిచారని వివరించారు.

తత్వవేత్తలుగా ప్రసిద్ధి చెందినవారెవరూ రాధాకృష్ణన్ పనిచేసినన్ని రంగాల్లో ప్రవేశించి ఉండరు. ఆయన పాలనాదక్షుడు, రాజనీతిజ్ఞుడు. అన్నింటినీ మించి.. ప్రాచ్య పాశ్చాత్య దేశాల్లో భారతీయ సంస్కృతికి ప్రతినిధిగా వ్యవహరించగలిగిన ప్రజ్ఞాధురీణుడు.

తత్వశాస్త్రాన్ని వర్తమాన పరిస్థితులకు అన్వయించడమే కాకుండా ప్రపంచమంతటికీ వర్తింపజేసిన మేటి రాధాకృష్ణన్. ఆయన పర్యటించని ప్రదేశం లేదు. ఆయనను గౌరవించని స్థలం లేదు.

సర్వేపల్లి ప్రబోధాలు..

'మతం ఆదర్శం – ఆధ్యాత్మిక సంబంధమైన అంతర దృష్టిని పొందడం. దీనికి మార్గమే నైతిక జీవనం, ధ్యానం'

'తత్వవేత్త జ్ఞానాన్ని ప్రేమించేవాడేగానీ జ్ఞాని కాదు.. యాత్ర ముగించడం ముఖ్యం కాదు, యాత్ర చేయడమే ముఖ్యం'

'విద్యార్థి జీవితాన్ని మలిచేది గురువే'

ఈ లోకంలోకి ఎంతో మంది వస్తున్నారు, వెళ్లిపోతున్నారు. కానీ, కొందరు మాత్రమే కారణ జన్ములు. వారు భౌతికంగా ఇక్కడ లేకున్నా.. మన మనసుల్లో ఎప్పుడూ నిలిచే ఉంటారు. అలాంటి మహామహుల్లో ఉత్తములు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. ఆయన కూడా అందరిలా జన్మించినా.. స్వశక్తితో అసాధారణ ప్ర పాటవాలతో ఉన్నత శిఖరాలకు ఎదిగి పలువురికి మార్గదర్శకంగా, తన వృత్తి ధర్మానికి మకుటంగా వెలిగారు. సర్వేపల్లిది కొనితెచ్చుకున్న గౌరవం కాదు. 'కొలిచి' తెచ్చుకున్న గౌరవం, వృత్తి రీత్యా, వ్యక్తిత్వ రీత్యా, సంస్కార రీత్యా ఆయణ్ని వరించింది. ఏ పనిలోనైనా నిబద్ధత కలిగి ఉండాలని ఆయన జీవితం మనకు పాఠం చెబుతుంది. సర్వేపల్లి జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకం.

### సర్వేపల్లి ప్రత్యేకతలు..

రాధాకృష్ణన్ అద్వైత వేదాంతి. శంకరుల మాయావాదాన్ని యథాతథంగా స్వీకరించలేదు. తన సొంత భాష్యం రాశారు. ఆయన రచనలు హిందూ ధర్మానికి పునరుద్దీపన కలిగించాయి. దార్శనిక శాస్త్రాలను ఆధునిక అవసరాలకు అనుగుణంగా మలచిన ఘనత సర్వేపల్లికే దక్కుతుంది.

సర్వేపల్లి గొప్ప మానవతావాది. ప్రతి మానవుడూ అతడి మతమేదైనా, సాంఘిక స్థితిగతులేమైనా పరమేశ్వరుడి రూపంలో పుట్టినవాడే అని నమ్మేవారు. ప్రతి మనిషీ ఆ ఈశ్వరుడికి ప్రియపుత్రుడిగా రాణించగల నిగూఢ శక్తులతో జన్మించినవాడేనని ఆయన అభిప్రాయం.

సర్వేపల్లి దృష్టిలో మతం అంటే – శక్తి, సంపదల కోసం కాకుండా.. శాంతి కోసం, సత్యం కోసం నిత్యాన్వేషణ. మతం అనేది సర్వసంగ పరిత్యాగం, ప్రారబ్ధానికి తలొగ్గడమూ కాదు. ధీరోదాత్తంగా సాగిపోవడమే మతం. ప్రస్థాన త్రయానికి ఆంగ్లంలో ఆధునిక దృష్టితో భాష్యం రాశారు సర్వేపల్లి. సోక్రటీస్ మొదలుకొని పాశ్చాత్య దార్శనికవేత్తల వరకు అందరి రచనలూ ఆయనకు కంఠోపాఠమే.

భగవద్గీతను చదివినంత శ్రద్ధాసక్తులతో బైబిల్ చదివారు సర్వేపల్లి. ఖురాన్ ఆయనకు కొట్టిన పిండి. సూఫీ తత్వాన్నీ మధించారు.

సర్వమతాలవారూ ఇతర మతాల పట్ల విశాలమైన, ఉదారమైన దృక్పథాన్ని అవలంబించాలని సర్వేపల్లి ప్రబోధించారు. ఎవరైనా ఇతర మతాలను, సంస్కృతులను విమర్శించడాన్ని ఆయన అంగీకరించేవారు కారు.

**నేడు ఉపాధ్యాయ దినోత్సవం**

# విద్యుత్ ఉత్పత్తిని పెంచేలా యాక్షన్ ప్లాన్

హైదరాబాద్: సెప్టెంబర్ 04ప్రజావినికిడి:
రానున్న రోజుల్లో తెలంగాణ ఒక బిజినెస్ హబ్ గా మారబోతుందని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉం చుకొని విద్యుత్‌ను అందుబాటులో ఉండేలా చూడాలని సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. విద్యుత్ శాఖపై జరిగిన సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ ఐటీ, పరిశ్ర మల శాఖలతో సమన్వయం చేసుకొని యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని సిఎం పేర్కొన్నారు.

సోలార్ విద్యుత్ వినియోగం పెరిగేలా చర్యలు చేపట్టాలని, డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు కావాల్సిన చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. వివిధ శాఖల్లో వినియోగంలో లేని భూముల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన చర్యలు తీసుకో వాలని సిఎం రేవంత్ సూచించారు.

రైతులకు సోలార్ పంప్‌సెట్‌లను ఉచితంగా అందించి వారిని సోలార్ విద్యుత్ వైపు ప్రోత్సహించాలన్నారు. కొండారెడ్డి పల్లెను పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని సిఎం రేవంత్ అధికారులకు ఆదేశించారు.

సోలార్ పంప్ సెట్‌ల ద్వారా వచ్చే మిగులు విద్యుత్‌పై రైతుకు ఆదాయం వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సిఎం రేవంత్ సూచించారు. వంటగ్యాస్ బదులుగా సోలార్ సిలిండర్ విధానాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. వీటిపై మహిళా సంఘాల కు శిక్షణ అందించి వారిని సోలార్ సిలిండర్ బిజినెస్ వైపు ప్రోత్సహించాలన్నారు. అటవీ భూముల్లోనూ సోలార్ విద్యుత్ ఉత్పత్తికి చర్యలు చేపట్టాలన్నారు.

ప్రతి ఏటా 40వేల మెగావాట్స్ విద్యుత్ అందుబాటులో ఉండేందుకు చర్యలు చేపట్టాలని, ప్రణాళికాబద్ధంగా వ్యవ హరించి దుబారాను తగ్గించాలని సిఎం రేవం త్ సూచించారు. ఓవర్ లోడ్ సమస్యకు శాశ్వ త పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని, ఒక్క నిమిషం కూడా విద్యుత్ సరఫరాకు అంతరా యం ఉండొద్దని వినియోగదారులకు 24గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామన్న నమ్మకం కలిగించాలని, వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బంది కలగనీ యొద్దని ముఖ్యమంత్రి రేవంత్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, అధికారులు పాల్గొన్నారు.

# మేడారంలో సుడిగాలులు

వరంగల్ సెప్టెంబర్ 04ప్రజావినికిడి:
అంతుచిక్కని ప్రళయం మేడారం అడవుల్లో విధ్వంసం సృష్టించింది. సుడిగాలుల బీభత్సం అడవిని మింగేసింది. ఏళ్ల తరబడి పెరిగిన వేలాది చెట్లు నేలకూలాయి. ములుగు జిల్లా తాడ్వాయి %-% మేడారం రిజర్వ్ ఫారెస్ట్ లో జరిగిన ఈ సంఘటన అటవీ శాఖ అధికారులకే అంతుచిక్కడం లేదు. టోర్నడో తరహాలో సృష్టించిన ప్రళయంపై అటవీ శాఖ అధికారులు ఎటూ తేల్చలేకపోతున్నారు. ములుగు జిల్లా ఏ టూరునాగారం వన్యప్రాణుల సంరక్షణ కేంద్రం పరిధిలో తాడ్వాయి %-% మేడారం రిజర్వ్ ఫారెస్ట్ ఉన్నది.వేలాది ఎకరా ల్లో విస్తరించిన ఈ అటవీ ప్రాంతంలో ఎన్నో అరుదైన వృక్షాలతోపాటు మెడిసినల్ మొక్కలు కూడా ఉన్నాయి. ప్రధానంగా టేపధానంగా, మద్ది, పెద్దేగి, జిట్రేగి, నల్లమ ద్ది, ఎజిత, నారవేప, రావి, గుంపెన, పచ్చ గంధం మొక్కలన్నీ సుడిగాలి బీభత్సానికి నేలకూలాయి. 200 హెక్టార్లలో 50 వేల వృక్షాలు వేర్లతో సహా నేలకొరిగాయి. గత మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు మబ్బులు, గాలి పెద్దగా వీచడం వల్ల సుడిగాలిలా మారి ఘటన జరిగిందని అధికారులు చెబుతున్నారు. మేడారంలో సుడిగాలి బీభత్సం సృష్టించిన అటవీ ప్రాంతాన్ని స్థానిక డిఎఫ్ఓ రాహుల్ జాదవ్ తో కలిసి పీసీసీఎఫ్ డోబ్రియాల్ పరిశీలించారు.



వేలాదిగా వృక్షాలు వేర్లతో సహా నేలకొరగడంతో ఖంగు తిన్నారు. ఇలాంటి పరిణామాన్ని తన 38 ఏళ్ల సర్వీసులో చూడలేదని పేర్కొన్నారు. గతంలో కూడా ఎన్నిసార్లు భారీ వర్షాలు కురిసినప్పటికీ ఇలాంటి ఘటనలు చోటుచేసుకోలేదని పేర్కొన్నారు. అటవీ శాఖ చరిత్రలోనే కనీవినీ ఎరుగని ఘటనగా ఆయన పేర్కొన్నారు. అడవిలో జరిగిన ప్రళయంపై తేల్చడానికి అటవీ శాఖ రంగంలోకి దిగింది. ఇలా జరగడానికి కారణాలు తెలుసుకునేందుకు వివిధ శాఖలతో సమన్వయం చేసుకునే దిశగా ప్లాన్ చేసింది. ఇప్పటికే ఐఎండి అధికారులతో ప్రాథమికంగా చర్చించారు. క్లైమటాలజీ వాళ్ళతో సంప్రదింపులు చేస్తున్నారు. మెట్రో లాజికల్ డేటా వచ్చిన తర్వాత అధ్యయనం చేసేందుకు సిద్ధం అవుతున్నారు.

అడవిలో సృష్టించిన ప్రళయం అటవీ శాఖ అధికారులను షాక్ కు గురిచేసింది. కొద్దిమొత్తంలో జరిగిందని భావించిన నేపథ్యంలో డ్రోన్లతో పరిశీలిస్తే వందలాది ఎకరాల్లో వేలాది మొక్కలు నేలకొరిగాయి. అమెరికా, ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, ఈస్టర్న్ చైనా, జపాన్, అర్జెంటీనా లాంటి దేశాల్లో టోర్నడో లు వస్తాయని, ఇక్కడ అలాంటి ఛాన్స్ లేదని అధికారులు చెబుతున్నారు. అయితే మనదేశంలో హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి ప్రాంతాల్లో సుడిగాలులు చుట్టుముట్టి అతలాకుతలం చేస్తాయని పేర్కొంటూ తొలిసారి ఇక్కడ వచ్చిందని చెబుతున్నారు. వర్షానికి తోడుగా మబ్బు, పెద్ద గాలి దగ్గరగా రావడంతో సుడిగాలిగా మారి ప్రళయం జరిగి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

అడవిలో జరిగిన బీభత్సంతో జరిగిన నష్టం అంచనాకు అధికారులు రంగం సిద్ధం చేశారు. నాలుగు రోజుల పాటు అధికారులు అడవిలో తిరిగి నేలకొరిగిన ప్రతి మొక్కను పరిశీలిస్తారని డిఎఫ్ఓ రాహుల్ జాదవ్ తెలిపారు. సిబ్బందిని ఇప్పటికే రెడీ చేశామని, లెక్కల తర్వాత నష్టం అంచనాతో ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని పేర్కొన్నారు. ఏడాది మొక్కలతో పాటుగా 70 ఏళ్ల వయసు ఉన్న మొక్కలు కూడా వేర్లతో సహా నేలకొరిగాయని చెప్పారు. ఇదే సుడిగాలి కనుక మేడారం గ్రామాన్ని చుట్టుముడితే పెను ప్రమాదం సంభవించేదని, సమ్మక్క -సారలమ్మ దయతో ప్రమాదం తప్పిందని డిఎఫ్ఓ రాహుల్ జాదవ్ తెలిపారు.

# హైడ్రా పేరుతో డబ్బులు వసూలు చేస్తే సమాచారం ఇవ్వండి: ఏసీబీ

హైదరాబాద్: సెప్టెంబర్ 04ప్రజావినికిడి:
హైడ్రా అధికారులమని చెప్పి ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని ఏసీబీ (అవినీతి నిరోధక శాఖ) తెలిపింది. చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న ఆక్రమణలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతోంది. గత కొన్నిరోజులుగా హైడ్రా కూల్చివేతలు చేపడుతోంది. ఇదే సమయంలో పాత నోటీసులను చూపించి కొంతమంది తాము హైడ్రా అధికారులమని చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది.

వీటిపై ఏసీబీ స్పందించింది. కొందరు ప్రయివేటు వ్యక్తులు, ప్రభుత్వ అధికారులు హైడ్రా పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, హైడ్రా అధికారులమని పాత నోటీసులు చూపించి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు గుర్తించామని ఏసీబీ తెలిపింది.

ఇలాంటి ఘటనలపై పలుచోట్ల బాధితులు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని పేర్కొంది. తమ దృష్టికి తీసుకువచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపింది.


# తెలుగు రాష్ట్రాల్లో ఏరియల్ సర్వే నిర్వహించాలని అమిత్ షాకు కిషన్ రెడ్డి, బండి సంజయ్ విజ్ఞప్తి

హైదరాబాద్: సెప్టెంబర్ 04ప్రజావినికిడి:
భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఏరియల్ సర్వే నిర్వహించాలని తెలంగాణ రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను కోరారు. వారి విజ్ఞప్తికి అమిత్ షా సానుకూలంగా స్పందించారు.రెండు తెలుగు రాష్ట్రాలలో ఏరియల్ సర్వేకు కేంద్రం సిద్ధమైంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటన చేయాల్సి ఉంది. ఈరోజే ఈ ప్రకటన వెలువడే అవకాశముందని భావిస్తున్నారు. కేంద్రమంత్రి ఆధ్వర్యంలోని ఉన్నతాధికారుల బృందం తెలుగు రాష్ట్రాల్లోని దెబ్బతిన్న ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించనున్నారు.

# ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయిస్తే పెన్షన్ కట్

**విప్లవాత్మక బిల్లును ఆమోదించిన హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ**

**అనర్హత వేటు పడిన ఎంఎల్‌ఎలకు వర్తింపు బిల్లును**



హైదరాబాద్: సెప్టెంబర్ 04ప్రజావినికిడి:
హిమాచల్ ప్రదేశ్‌లో పార్టీలు ఫిరాయించే ఎమ్మెల్యేలకు పింఛన్లు ఉండవు. ఈ కోత విధించే రీతిలో ఓ బిల్లును కాంగ్రెస్ అధికారంలో ఉన్న హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఒక పార్టీ నుంచి ఎన్నికై మరో పార్టీకి వెళ్లే ఎమ్మెల్యేలకు పెన్షన్ సౌకర్యం లేకుండా చేసే ఈ బిల్లును సభ ఆమోదించింది. హిమాచల్ ప్రభుత్వం ఈ అసాధారణ బిల్లును తీసుకురావడం, ఆమోదింపచేసు కో వడం, ఫిరాయింపుల వ్యతిరేక ప్రక్రియలో కీలక ఘట్టం అయింది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం పరిధిలోకి వచ్చే ఎమ్మెల్యేలకు ఇప్పుడు ఈ బిల్లు వర్తిస్తుంది. వీరిపై వేటుపడుతుంది.బిల్లును రాష్ట్ర ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖూ ప్రవే శపెట్టారు. హిమాచల్ ప్రదేశ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ ( సభ్యుల అలవెన్స్‌లు,పెన్షన్లు)సవరణ బిల్లు2024 పేరిట దీనిని తీసుకువచ్చారు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ పరిధిలో ఏ దశలో అయినా సభ్యు లు అనర్హతకు గురైతే అటువంటి వ్యక్తి చట్టం పరిధి లో పెన్షన్, ఇతరత్రా అలవెన్స్‌లకు అర్హులు కారని ఈ బిల్లులో పేర్కొన్నారు. బిజెపి, కాంగ్రెస్ నడు మ తరచూ అధికార మార్పిడి, ఈ క్రమంలో ఎమ్మె ల్యేల ఫిరాయింపులు జరిగే ఈ రాష్ట్రంలో ఈ బిల్లు అత్యంత కీలకమైనది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆరు గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఫిరాయింపుల నిరో ధక చట్టం పరిధిలో ఎమ్మెల్యేలుగా అనర్హులుగా ప్రకటించారు.

# నా కుమారుల నుండి ప్రాణహాని ఉంది

**18 ఎకరాల భూమి, ఇల్లు లాక్కున్నారు**

**వారి నుండి రక్షణ కల్పించి.. భూమి, ఇల్లు అప్పగించేలా చూడాలి.**

**మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించిన పులగం పిచ్చమ్మ**




ప్రజావినికిడి,(హైదరాబాద్): సెప్టెంబర్ 4, తాను,తన భర్త కాయాకష్టం చేసి సంపాదించిన ఆస్తులను లాక్కోవడంతోపాటు తమకున్న 18 ఎకరాల భూమిని తన కుమారులు అక్రమంగా లాక్కొని తనను ఇంటి నుండి గెంటివేశారని నల్గొండ జిల్లా శాలిగౌరారం మండలం పెరుక కొండారం గ్రామానికి చెందిన పులగం పిచ్చమ్మ ఆరోపించారు.తన భర్త పులగం ధర్మారెడ్డి, తాను కాయాకష్టం చేసి స్వగ్రామంలో ఇల్లును నిర్మించుకోవడంతోపాటు 18 ఎకరాల భూమిని కొనుగోలు చేసి సాగు చేస్తున్నామని తెలిపారు.తన భర్త మరణానంతరం కొడుకులు పులగం రఘుపతి రెడ్డి,పులగం వేణుగోపాల్ రెడ్డిలు తమ భార్యలతో కలిసి తన పేరిట ఉన్న 18 ఎకరాల భూమితో పాటు ఇంటిని వారి పేరిట బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు.తన భూమిని,ఇల్లును తనకు ఇప్పించాలని కోరుతూ పులగం పిచ్చమ్మ న్యాయవాదులతో హైదరాబాదులోని తెలంగాణ మానవ హక్కుల



కమిషన్ కార్యాలయంలో బుధవారం ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పిల్లలను కని పెంచి,ఉన్నత విద్యావంతులుగా చేయించానని తెలిపారు. వృద్ధాప్యంలో ఉన్న తనను ఇష్టానుసారంగా తిడుతూ తన పేరిట ఉన్న 18 ఎకరాల భూమితో పాటు సొంతింటిని వారి పేరిట బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. వృద్ధాప్యంలో ఉన్న తనను తన కుమారులు ఆస్తికోసం ఇంటి నుండి గెంటివేసి తన ఆస్తులను చేజెక్కించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుతం తన కుమార్తె వద్ద ఉంటున్నానని పేర్కొన్నారు.తన కుమారుల నుండి తనకు,కూతురికి, అల్లుడికి ప్రాణహాని ఉందని తెలిపారు.తన కుమారుల నుండి భూమితో పాటు ఇంటిని తనకు అప్పజెప్పి తనకు,తన కూతురు కుటుంబానికి ప్రాణ రక్షణ కల్పించాలని ఆమె మానవ హక్కుల కమిషన్‌ను కోరారు.

### పులగం పిచ్చమ్మకు న్యాయం జరిగేలా చూస్తాం: న్యాయవాది శ్రీనాథ్

వృద్ధాప్యంలో ఉన్న తల్లి ఆలనా పాలన చూసుకోవాల్సిన కుమారులు భూమిని, ఇంటిని లాక్కొని ఇంటి నుండి గెంటి వేయడం బాధాకరమని న్యాయవాది ఎ.శ్రీనాథ్ అన్నారు. బాధితురాలు పులగం పిచ్చమ్మకు న్యాయం జరిగేలా మానవ హక్కుల కమిషన్ తోపాటు తన వంతు కృషి చేస్తానని భరోసా కల్పించారు.పులగం పిచ్చమ్మ వెంట న్యాయవాది ఎ.సుధారాణి తదితరులు ఉన్నారు.

## జూనియర్ కళాశాలలో టిఎస్ఎస్ఓ నూతన కమిటీ ఎన్నిక

**టిఎస్ఎస్ఓ కమిటీ అధ్యక్షులుగా రవితేజ..**




ప్రజావినికిడి, (శంషాబాద్):సెప్టెంబర్ 04, శంషాబాద్ జూనియర్ కళాశాలలో టిఎస్ఎస్ఓ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు కళాశాల నూతన కమిటీ నియమించడం జరిగింది.టి ఎస్ ఎస్ ఓ కమిటీ అధ్యక్షులుగా రవితేజ, ఉపాధ్యక్షుడిగా జస్వంత్,కార్యదర్శిగా ఆదిల్, సాయినాథ్, శివకుమార్,రంజిత్ కుమార్,కార్యవర్గ సభ్యులుగా సునీల్, వేణు,ఈశ్వర్, శివప్రసాద్, రామకృష్ణ,సతీష్ గా 50 మంది సభ్యులతో నూతన కమిటీ నియమించడం జరిగింది.ఈ సందర్భంగా మాట్లాడుతూ, కళాశాలలో ఉన్నటువంటి సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తొందరగా పరిష్కరించి పేద మధ్యతరగతి విద్యార్థుల ఉన్నత చదువుకు తోడ్పడుతారని అదేవిధంగా శంషాబాద్ బస్ స్టాప్ నుంచి కళాశాల వరకు అధిక దూరం ఉన్నందువలన బస్సు సౌకర్యం కల్పించాలని కళాశాలలో అధ్యాపకులు తక్కువ ఉండడం వలన సబ్జెక్టు వారిగా తరగతులు నిర్వహించడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాబట్టి కళాశాలలో ఉన్నటువంటి సమస్యలను వీలైనంత తొందరగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## శంషాబాద్ మండల ఎమ్మార్వో ని మర్యాదపూర్వకంగా కలిసిన

**అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఎర్ర నిఖిల్ కుమార్**



ప్రజావినికిడి (శంషాబాద్):సెప్టెంబర్ 04, శంషాబాద్ మండల కేంద్రం పెద్ద షాపూర్ గ్రామ అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఎర్ర నిఖిల్ కుమార్ నూతనంగా వచ్చిన శంషాబాద్ మండల ఎమ్మార్వో ని అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఎర్ర నిఖిల్ కుమార్ కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.దళితుల భూమిల పై ఉన్న సమస్యలు త్వరగా పరిష్కార మార్గం చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్,పరశురామ్, పవన్,తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సౌధ ముందు మహాధర్నా..

## తెలంగాణ విద్యుత్ బీసీ,ఓసి ఉద్యోగుల మహాధర్నా..





**ప్రజావినికిడి,(ఖైరతాబాద్):**

విద్యుత్ ఉద్యోగుల పదోన్నతులపై న్యాయవిచారణ చెయ్యాలి తెలంగాణ విద్యుత్ బీసీ, ఓసి ఉద్యోగుల మహాధర్నా, 4వ తేదీ బుధవారం రోజు ఉదయం10.30 నిమిషాలకు విద్యుత్ సౌదా,ఖైరతాబాద్ హైదరాబాద్. తెలంగాణ విద్యుత్ సంస్థలైన ట్రాన్స్కో జెన్కో ఎస్పీడీసీఎల్ ఎన్పీడీసీఎల్ సంస్థల్లో పనిచేస్తున్న వేలాది మంది బీసీ,ఓసి ఉద్యోగులు విద్యుత్ సౌద ముందు మహాధర్నా నిర్వహించడం జరిగింది.విద్యుత్ సంస్థల్లో బీసీ,ఓసి ఉద్యోగులకు నష్టం కలిగించే విధంగా ప్రభుత్వ ఆదేశాలను, సుప్రీంకోర్టు,హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయకుండా గత కొన్ని సంవత్సరాలుగా కండిషన్ల పేరు మీద పదోన్నతులు కల్పిస్తున్నారు. యాజమాన్యాల తీరును వ్యతిరేకిస్తూ విద్యుత్ సంస్థల్లో 35 వేలకు పైగా పనిచేస్తున్న బీసీ,ఓసి ఉద్యోగులకు సత్వరం న్యాయం చెయ్యాలని యాజమాన్యాలను, రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినప్పటికీ న్యాయం జరగలేదు. అందుకు నిరసనగా భవిష్యత్తు కార్యాచరణలో భాగంగా విద్యుత్ సౌదా ముందు మహాధర్నా నిర్వహించవలసినటువంటి అవసరము ఏర్పడింది.మహాధర్నా చేపట్ట బోతున్నట్టు యాజమాన్యాలకు, ప్రభుత్వానికి తెలిపినా కూడా యాజమాన్యాలు సుమారుగా 3830 మందికి ఉద్యోగులకు మరో కొత్త కండిషన్లతో అడ పద్ధతిలో పదోన్నతులు కల్పించి కొత్త విధానానికి తెరలేపారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వంలోని యాజమాన్యాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉద్యోగులకు సంబంధించిన విభజనకు సంబంధించిన సుప్రీంకోర్టులో ధిక్కరణ కేసు ముగించుకునే దాంట్లో భాగంగా ఆగమేఘాలపై నవంబర్ 2022లో సుమారుగా 1600 మందికి కండిషన్ల పేరు మీద పదోన్నతులు కల్పించి ఇచ్చిన పదోన్నతులను ప్రభుత్వ ఉత్తర్వుల, సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పుల మేరకు తర్వాత సమీక్షించి నష్టపోయిన బీసీ,ఓసీ ఉద్యోగులకు న్యాయం చేస్తామని తెలిపారు. కానీ,అందుకు విరుద్ధంగా ప్రస్తుత యాజమాన్యాలు పాత కండిషన్లను పక్కనపెట్టి మరో కొత్త కండిషన్లను జోడిస్తూ,అడహాక్ పద్ధతిలో ప్రమోషన్లు కల్పించడం విద్యుత్ సంస్థల్లో చర్చనీయాంశంగా మారింది. అంటే గత యాజమాన్యాలు విధించినటువంటి షరతులు ప్రస్తుతం ఉన్నట్లా? లేనట్లా? అనే ప్రశ్న ఉద్యోగుల్లో చర్చగా మారింది. ప్రస్తుతం కల్పించిన పదోన్నతులు ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ప్రస్తుత సీఎండి రోనాల్డ్ రోస్ సెలవులో ఉన్న సమయంలో పదోన్నతులు కల్పించడం బీసీ,ఓసి ఉద్యోగులకు విస్మయాన్ని కల్పించింది. ఇప్పటికైనా ముఖ్యమంత్రివర్యులు అనుముల రేవంత్ రెడ్డి,ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మరియు ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్ ప్రత్యేక చొరవ చూపి విద్యుత్ సంస్థల్లో అపరిష్కృతంగా ఉన్న క్రింది అంశాలను వెంటనే పరిష్కరించాలని మహా ధర్నా డిమాండ్ చేస్తుంది.లేని పక్షంలో విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న బీసీ,ఓసి ఉద్యోగులు సమ్మె చేయడానికి వెనుకాడే పరిస్థితి లేదని మహాసభ ముక్తకంఠంతో నినదించింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య పాల్గొనడం జరిగింది, కార్యక్రమంలో ఐక్య కార్యాచరణ సమితి చైర్మన్ కోడెపాక కుమార స్వామి,కో చైర్మన్ ఆర్.సుధాకర్ రెడ్డి,కన్వీనర్ మొత్యం వెంకన్న గౌడ్,కో కన్వీనర్ సి భాను ప్రకాష్ ఇతర రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నీలారపు రాజేందర్, సోమయాజులు,ఎం విజయ కుమార్,పి యాదగిరి,మారం శ్రీనివాస్,జీ బ్రహ్మేంద్ర రావు,ఎన్ సదానందం,ఏం అశోక్ కుమార్,సంపత్ రెడ్డి, కొమరవెల్లి రవీందర్, డాక్టర్ చంద్రుడు,ప్రేమ్ కుమార్,ప్రవీణ్ కుమార్,రంగు సత్యనారాయణ, సామల శివాజీ, యజ్ఞప్రసాద్,ఆడెపు శ్రీకాంత్,వెంకటేష్,పిల్లి అశోక్,కిషోర్ ఏ మధు, తదితర నాయకులు వేల సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు. డిమాండ్స్ (1) విద్యుత్ సంస్థల్లో కండిషన్ల పేరుపై కల్పిస్తున్న పదోన్నతులపై హైకోర్టు సెట్టింగ్ జడ్జి లేదా జ్యుడిషియల్ ఎంక్వయిరీ జరిపించి తగు చర్యలు తీసుకోవాలి, (2) విద్యుత్ సంస్థల్లో జూన్ 2, 2014 నుండి కల్పించిన అన్ని పదోన్నతులను ప్రభుత్వ ఆదేశం తేది 24-10-2019,గౌరవ హైకోర్టు ఉత్తర్వుల (డబ్ల్యూ.పి నంబర్ 4415/2016 తేదీ:11-12-2018, డబ్ల్యూపి నంబర్. ఏ47125/2018 తేదీ: 04-02-2019) ప్రకారం సమీక్షించి నష్టపోయిన బీసీ, ఓసి ఉద్యోగులకు వెంటనే పదోన్నతులు కల్పించాలి (3) విద్యుత్ సంస్థల్లో నేరుగా నియమించబడుతున్న ఉద్యోగుల సీనియారిటీని మెరిట్ ఆధారంగా రెగ్యులేషన్ 26 (ఏ) పార్ట్-2 మరియు స్టేట్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్ 33 (బి) %డ% 36 (ఐ) ప్రకారం నిర్ధారించి తుది సీనియారిటీలను ప్రకటించాలి.(4) విద్యుత్ సంస్థల్లో జూనియర్ లైన్మెన్ స్థాయి నుండి చీఫ్ ఇంజనీర్ స్థాయి వరకు అన్ని కేడర్లలో తుది సీనియారిటీలను వెంటనే ప్రకటించి ఉద్యోగులకు తెలియజేయాలి.(5) విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్ ఉద్యోగులకు ఏ పీ ఎస్ ఇ బి రూల్స్ వర్తింపజేసి విద్యా అర్హతల ఆధారంగా పదోన్నతులు కల్పించాలి కోడెపాక కుమార స్వామి, ముత్యం వెంకన్న గౌడ్, చైర్మన్ కన్వీనర్ ఆర్.సుధాకర్ రెడ్డి, సి.భాను ప్రకాష్ కో చైర్మన్ కో కన్వీనర్.

# రుణమాఫీ.. రైతన్న హ్యాపీ..

**రైతు సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం..**

**22 లక్షల 35 వేల రూపాయల చెక్కులు 24 మంది రైతులకు అందజేసిన**

**పి.ఏ.సి.ఎస్. చైర్మన్ బొమ్మ దవనకర్ గౌడ్..**





ప్రజావినికిడి (శంషాబాద్):సెప్టెంబర్ 04:రైతు సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం అని పి.ఏ.సి.ఎస్. చైర్మన్ బొమ్మ దవనకర్ గౌడ్ అన్నారు.శంషాబాద్ మండల కేంద్రం చిన్న గోల్కొండ సొసైటీ చైర్మన్ బొమ్మ దవనకర్ గౌడ్ ఆధ్వర్యంలో స్వల్పకాలిక రైతు రుణాల సుమారు 22 లక్షల 35 వేల రూపాయల చెక్కులు 24 మంది రైతులకు అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా పి.ఏ.సి.ఎస్.చైర్మన్ బొమ్మ దవనకర్ గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం రైతు సంక్షేమ కోసం నిరంతరం కృషి చేస్తుందని రైతు సంక్షేమ లక్ష్యంగా ప్రభుత్వం పని చేయడం జరుగుతుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మంచర్ల మోహన్ రావు,సీఈఓ యాదయ్య, సిబ్బంది సురేష్ మధుమతి, జగపతిబాబు చెక్కులు తీసుకున్న రైతులు కళావతి, అనంతరాములు, సుదర్శన్,గడ్డంరవి యాదవ్,ప్రవీణ్ రెడ్డి, దేవలపల్లి చెన్నయ్య, అజయ్,కాసారం మహేందర్,ఎం దేవేందర్ రెడ్డి, మన్నెమ్మ,జి మల్లేష్ చెక్కులు తీసుకున్నారు.

## నిజాంపేట్ ప్రగతి నగర్ లో ఉప్పొంగిన పాపయ్యచెర్వు..




ప్రజావినికిడి, (కుత్బుల్లాపూర్): కత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో క్రితం రోజులుగా కురుస్తున్న వర్షానికి అతలాకుతలం అవుతున్న విషం తెలిసిందే.నిజాంపేట్ శ్రీనివాస్ నగర్ నుండి పలు కాలనీ లలో అపార్ట్మెంట్ లో కి సెల్లార్ లోకి భారీ గా పాపయకుంట్ట చెరువు నీరు కాలువలాగా పర్వహిస్తున్న వైనం. 2018లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నీటిపారుదల అలాగే ఆయకట్టు శాఖ మీషన్ కాకతీయ నాల్గొవ విడత పాపాయకుంట పునరుద్దరణ పనులకు 21.06 లక్షల రూపాయలతో గత ప్రభుత్వం పునరుద్దరణ పనులు చెపించిన ఫలితం ఇదేనా అని పలువురు వాపోయారు.ఈ నీరు నిజాంపేట్ చెరువు లో కలుస్తది అది బజారులు,రోడ్డు లే దిక్కు.అనీ దీనికి సరిగా నాలా కూడా లేదు.నీరు పోయె క్రమంలో ఇండ్లు, అపార్ట్మెంట్లు నిండడం తో ప్రజలు బయటికి రావడం కూడా భయం భయం గా బయటికి రావలసిన పరిస్థితి. పిల్లలు స్కూల్ కి వెళ్లలేని పరిస్థితి,రాత్రి పూట బయటికి రావాలంటేనే నరక యాతన అనుభవిస్తున్నమని కాలానివాసులు చెపుతున్నారు.ఇంత జరుగుతున్నా ఎ ఇరిగేషన్ అధికారులు,మున్సిపల్అధికారులు,ప్రజా ప్రతినిధులు వచ్చి చెర్యలు తీసుకున్నది లేదని వాపోతున్నారు.దీనిపై తక్షణమే చెర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

## వరద బాధితులకు నాగార్జున రూ.కోటి సాయం..



ప్రజావినికిడి,(హైదరాబాద్):

వరదలతో అతలాకుతలమైన రెండు తెలుగు రాష్ట్రాలకు సినీ హీరో నాగార్జున రూ.కోటి సాయం ప్రకటించారు. వరద బాధితులను ఆదుకునేందుకు ఇరు రాష్ట్రాలకు చెరో రూ.50 లక్షలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



## 125 డివిజన్ పరిధిలోని పలు కాలనీలో వర్షం కారణంగా దెబ్బతిన్న రోడ్లు డ్రైనేజీ సమస్యలపై పాదయాత్ర... కార్పొరేటర్ రావుల శేషగిరి





ప్రజావినికిడి, (కుత్బుల్లాపూర్):
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 125 గాజులరామారం డివిజన్ పరిధిలోరావి నారాయణరెడ్డి నగర్, న్యూ భవాని నగర్ సంఘమిత్ర స్కూల్ ప్రాంగణం లో అలాగే కైసర్ నగర్ లో వర్షం కారణంగా డ్రైనేజ్ రోడ్లు సమస్యలపై పాదయాత్ర చేస్తున్న బిజెపి నాయకులు గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి,ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సాయినాథ నేత,జిల్లా ఓబీసీ ప్రచార కార్యదర్శి మురళీకృష్ణ, శ్రీనివాస్, బాలకృష్ణ, ప్రభాకర్, శేఖర్,శ్రీనివాస్,రాజు, చిన్న,శ్రీను,శారద, లక్ష్మి తదితర బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## సబ్ స్టేషన్ స్థల పరిశీలన



ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంబిపూర్,మల్లంపేట్ మరియు బౌరంపేట్ గ్రామంలో 3 -ఫేస్ కరెంటు ఒడిదుడుకులు అలాగే కరెంటు రాకపోవడంతో గత నెల కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి కె .వి ఆర్,స్ప్రింగ్ వుడ్స్,ప్రణీత్ నతురల్ బౌంటీ మరియు ల్యాక్ రిడ్జ్ కాలనీ వాసులు విన్నపించగా వారు వెంటనే స్పందించి ఎస్.ఈ,డి.ఈ మరియు ఎ.ఈ తో మాట్లాడి సబ్ స్టేషన్ మంజూరు చేయించారు.ఈ సందర్భంగా ఈ రోజు శంబిపూర్,మల్లంపేట్ మరియు బౌరంపేట్ గ్రామంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు స్థలాన్ని పై అధికారులతో పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎంసి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, ట్రాన్స్కో ఎస్ఈ-రంజీ, ఎడిఈ అరుణ్, ఎస్ఈ.రవికుమార్, డిఈ-జీడిమెట్ల విష్ణువర్ధన్ రెడ్డి,ఎఈ బాచుపల్లి- శాంత కుమార్, డిఈ కూకట్ పల్లి -చక్రవర్తి,ఎడిఈ మియాపూర్-హరికృష్ణ, ఏ ఈ భౌరంపేట్- సాయికుమార్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కోదండరామ్ కు గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ నేతల సన్మానం..



ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):
తెలంగాణ రాష్ట్ర శాసన మండలి సభ్యులుగా నియమితులైన తెలంగాణ ఉద్యమ నేత ప్రొఫెసర్ ఎం. కోదండరామ్ కు గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటీవ్ హౌసింగ్ సొసైటీ నాయకులు అభినందనలు తెలియజేశారు. బుధవారం హైదరాబాద్ లోని చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో ఆయనకు జరిగిన పౌర సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ ను పూలబొకే, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.సొసైటీ కార్యదర్శి బొల్లం శ్రీనివాస్, నాయకులు తన్నీరు శ్రీనివాస్, యర్రమిల్లి రామారావు, పులిపలుపుల ఆనందం,సీహెచ్ వీరారెడ్డి తదితరులు కూడా ప్రొఫెసర్ కోదండరాం ను సన్మానించారు.

## ఖైరతాబాద్ బడా గణేశ్‌కి ఏడు చందాలు చెల్లించే వారికి రెండు అపురూప గ్రంథాలు..
### :ఉత్సవ కమిటీ చైర్మన్ దానం నాగేందర్



హైదరాబాద్: సెప్టెంబర్ 04ప్రజావినికిడి:
వినాయక చవితికి ఏర్పాట్లు జోరుగా సాగుతున్న వేళ ఖైరతాబాద్ ఉత్సవ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ ఎమ్మెల్యే దానం నాగేందర్, అధ్యక్షుడు రాజ్‌కుమార్ కీలక ప్రకటన చేశారు. ఖైరతాబాద్ గణేశుడికి ఏడు చందాలు చెల్లించే, అతిథులుగా పాల్గొనే భక్తులకు రెండు అపురూప గ్రంథాలను బహూకరించనున్నట్టు తెలిపారు. ప్రముఖ వైద్య సంస్థలు కిమ్స్ ఫౌండర్ చైర్మన్ బొల్లినేని కృష్ణయ్య సమర్పణలో ప్రముఖ రచయిత పురాణపండ శ్రీనివాస్ రచించిన వంద పేజీల శ్రీ గణపతి భగవానుని పవిత్ర గ్రంథం 'గణానా త్వా'.. వారాహి చలనచిత్ర అధినేత సాయి కొర్రపాటి సమర్పణలో వచ్చిన గ్రంథం 'శ్రీమాలిక'ను చందాలు చెల్లించిన వారికి అందించనున్నారు. వినాయక చవితి సందర్భంగా ఈ మంత్రమయ జ్ఞాపికలను లభించే అరుదైన అక్షర సంపదలను సమర్పించడం తన అదృష్టమని దానం నాగేందర్ పేర్కొన్నారు. శ్రీనివాస్ పరమాద్భుత విలువల 'గణానా త్వా' గ్రంథం ఇప్పటికే హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లోని అనేక ఆలయాలకు చేరింది. ఇందులో శ్రీ వరసిద్ధి వినాయక వ్రత కథతోపాటు విఘ్నేశ్వరుడి సౌందర్య చిత్రాలతో భక్తులను ఆకట్టుకుంటోంది. డెబ్భైకి పైగా ధార్మిక, ఆధ్యాత్మిక అపురూప గ్రంథాల్ని రచించి సంకలనం చేసి వేలమంది అభిమానులను సంపాదించుకున్న శ్రీనివాస్ గత రెండున్నర దశాబ్దాలుగా ఏటా వినూత్న శోభలతో వరసిద్ధి వినాయక చవితి పవిత్ర సంచికను అందిస్తున్నారు.

## శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో
# మట్టి గణపతుల వితరణ..



ప్రజావినికిడి, (కుత్బుల్లాపూర్):
మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని కుత్బుల్లాపూర్ ప్రెస్ క్లబ్ (టి యు డబ్ల్యూ జె హెచ్ 143) అధ్యక్షుడు సుధీర్ మంకాల పేర్కొన్నారు.శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సూరారం కాలనీ మార్కెట్ రోడ్డు లోని శ్రీ విజయ దుర్గ అమ్మవారి ప్రాంగణంలో ఉచిత మట్టి గణపతులను భక్తులకు అందజేశారు. సందర్భంగా సుధీర్ మంకాల మాట్లాడుతూ, ఇప్పటికే చెరువులు కాలుష్యమైపోతున్నాయని వీటికి తోడు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ మరియు ఇతర కెమికల్స్ తో చేసిన గణపతులు పూజించి చెరువులో నిమజ్జనం చేయడం వలన చెరువులు మరింత కలుషితమయ్యే ప్రమాదం నెలకొని ఉందని,దానికోసం శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం చేస్తున్న కార్యక్రమాలు దృష్టిలో పెట్టుకొని మట్టి గణపతులను వారికి అందజేయడం జరిగిందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు మట్టి గణపతి పూజించి పర్యావరణం కాపాడాలని ఉద్దేశంతో మట్టి గణపతులను అందరికీ ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు.తమకు సహాయ సహకారాలు అందించిన సుధీర్ మంకాలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన సలహాదారులు సర్వేపల్లి రమేష్ కుమార్,సంఘు సభ్యులు ఆలయ ప్రధాన పూజారి చక్రధారి శ్రీరామ శర్మ, సింహాచలం శ్రీధరాచార్యులు, వారి రాఘవేంద్ర,టెమ్జూ అధ్యక్షుడు జనార్ధన్ రెడ్డి, ప్రెస్ క్లబ్ సభ్యులు మాధవరెడ్డి, భాస్కర్ రెడ్డి తో పాటు శ్రీ విజయ దుర్గ దేవాలయం కమిటీ చైర్మన్ వెంకట స్వామి, ప్రధాన సభ్యులు యాదగిరి,శ్రీనివాస్, సత్యనారాయణ, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన మంత్రి విశ్వ కర్మ పథకాన్ని తెలంగాణ లోని
# రజకులందరు సద్వినియోగం చేసుకోండి..

### మల్లేశ్వరపు రాజేశ్వరి పిలుపు..






ప్రజావినికిడి, ( లోయర్ ట్యాంక్ బాండ్):
ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన అనే పథకము కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17 2023 తేదీన ప్రవేశ పెట్టింది.కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా గా గల బడుగు బలహీన వర్గాలు జాతుల కు పూర్తిగా వృత్తి మీద ఆధార పడిన వాళ్లకు వారి వృత్తి లో నైపుణ్యత పెంచడానికి మరియు వారికి ఆర్థికంగా సాయం అందించడానికి దేశ జనాభా లో సగానికి పైగా గా జనాభా కు ఉపయోగ పడేవిధంగా అమలులోకి తెచ్చిన పథకము.ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం దేశం లోని వెనుకబడిన తరగతులు 18 కులాల చేతివృత్తుల వారికి 2028 సంవత్సరము వరకు కూడా అవకాశం కల్పించింది.ఈ పథకం కోసం కేంద్ర ప్రభుత్వం 13,000 కోట్ల రూపాయలు కేటాయించింది రాజేశ్వరి తెలిపారు.
ఈ విశ్వకర్మ పథకం లో చేరిన వారికి ప్రత్యేక మైన శిక్షణ ఇచ్చి దానికి గుర్తింపుగా ఒక సర్టిఫికెట్ అలాగే గుర్తింపు కార్డు ను అందజేస్తారు.శిక్షణ తరువాత వారికి ఒకటవ దశలో వారికి ఒక (1) లక్ష రూపాయలు రెండవ దశలో వారికి రెండు లక్షల రూపాయలు కేవలం 5 శాతంవడ్డీ తో రుణాలు అందచేస్తారు.బుధవారం రోజు అనగా 04-09-2024 తేదీన హైదరాబాద్ లో ముఖ్యముగా నిరంతరం వృత్తి మీద ఆధారపడే రజకుల సంభంధించి అవేర్నెస్ ప్రోగ్రాం ఏర్పాటు చేయడమెయినది.కానీ ఇప్పటికి కూడా తెలంగాణ లో ఈ పథకము ను ఎక్కువ మంది చేరలేకపోయారు కావున ఇప్పటికైనా తెలంగాణ లో ని ప్రతి రజకుడు ఈ పథకము నందు చేరి లబ్ది పోంది వారి జీవితం లో వెలుగులు నింపుకోవాలని ఈ సమావేశం లో పాల్గొన్న మల్లేశ్వరపు రాజేశ్వరి అక్కక్షించారు.
ఈ కార్యక్రమం శ్రీమతి ఎన్ సుమతి అసిస్టెంట్ డైరెక్టర్ ఎంఎస్ఎం ఈ వారి అధ్యక్షతన ఎమ్మెస్సార్ ఆఫీస్ నందు జరిగినది.ఈ కార్యక్రమం నకు కి జిహెచ్ఎంసి జాయింట్ కలెక్టర్,బ్యాంకర్స్,బీసీ వెల్ఫేర్ ఆఫీసు అలాగే ఇందుకు సంబంధించి అనేకమంది అధికారులు హాజరయ్యారు.అలాగే
శ్రీమతి ఈ కార్యక్రమం నందు శ్రీమతి మల్లేశ్వరపు రాజేశ్వరి రాష్ట్ర బిజెపి ఓబీసీ రజక సెల్ కన్వీనర్,రాష్ట్ర కో కన్వీనర్ అల్లంపల్లి సర్వీస్,తెలంగాణ రజక అభివృద్ధి సంస్థ గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ మా ఊరపు నరసింహ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపల్లి రాజశేఖర్, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి బండిరాల చంద్రమోహన్,ఖజానా దొభీఘాట్ చైర్మన్ ఆందోల్ సాయి సత్యనారాయణ మొదలగు వారు పాల్గొన్నారు.

## నవజీవన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా
# వినాయకుడి ఆగమన్ కార్యక్రమం..





ప్రజావినికిడి,(కర్మన్ ఘాట్):

నవజీవన్ యూత్ అసోసియేషన్ నందనవనం ఇందిరమ్మ బ్లాక్ ఆధ్వర్యంలో మంగళవారం నాడు వినాయకుడి ఆగమన్ కార్యక్రమాన్ని ఎంతో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ,గత 17 ఏళ్ల నుంచి ఇక్కడ వినాయకుడిని ప్రతిష్టిస్తున్నామని, ఇందులో భాగంగా ప్రతి సంవత్సరం వినాయకుడి ఆగమన్ కార్యక్రమాన్ని ఎంతో అంగరంగ వైభవంగా నిర్వర్తిస్తున్నామని అన్నారు. నాగోల్ నుండి ఈ వినాయకుని తెప్పించామని అక్కడినుండి టీకేఆర్ కమాన్ నుండి నందనవనం ఇందిరమ్మ బ్లాక్ వరకు డీజే ఆటపాటలతో ఆగమన్ నిర్వహించామని అన్నారు. అలాగే వినాయక చవతి సందర్భంగా ఘనమైన పూజలు నిర్వహించి శోభాయాత్ర ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తామని అన్నారు.ప్రతి సంవత్సరం వినాయకుడి ఎత్తు పెంచుకుంటూ పోతున్నామని అన్నారు.మా వినాయకుడి ఎత్తు ఈ ప్రాంతంలో ఎక్కడ ఉండదని అన్నారు.ఆ వినాయకుడి దయ అందరిపై ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో నవీన్, గణేష్, మహేష్, అజయ్,ఆనంద్, అరుణ్,అయ్యప్ప, భీమ్,శంకర్, శివ, చందు,చిన్న,అజ్జి, దావిద్,వెంకటేష్, నరసింహ,పర్ష,ప్రకాష్, రవి,సతీష్, శంకర్, శివ,సులేమాన్, జహీర్,యాకూబ్,సన్నీ తదితరులు పాల్గొన్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613

# జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలికి హైకోర్టు నోటీసులు



హైదరాబాద్: సెప్టెంబర్ 04ప్రజావినికిడి:
జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలికి తెలంగాణ హైకోర్టు బుధవారం నోటీసులు ఇచ్చింది. ఆమెతో పాటు పర్యావరణ, భూగరర్భ గనుల శాఖల ముఖ్యకార్యదర్శులకు కూడా నోటీసులు జారీ చేసింది. జూబ్లీహిల్స్ నివాస ప్రాంతాల్లో కొండరాళ్లను తొలగించేందుకు రేయింబవళ్లు పేలుళ్లు జరుపుతుండడంతో ఈ విషయమై వార్తా పత్రికల్లో కథనాలు వచ్చాయి. ఈ కథనాలపై స్పందించిన హైకోర్టు జడ్జి జస్టిస్ నగేశ్ భీమపాక చీఫ్ జస్టిస్‌కు లేఖ రాశారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా దాదాపు పది పేలుళ్లు జరిపి బండరాళ్లను తరలిస్తున్నట్లు ఆయన తన తేఖలో వెల్లడించారు.రాత్రిపూట పెద్ద శబ్దాలు వస్తుండటంతో సమీప ప్రాంతాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని లేఖలో వెల్లడించారు. ఈ లేఖను న్యాయస్థానం ప్రజా ప్రయోజన వ్యాజ్యంగా స్వీకరించి బుధవారం విచారణ జరిపింది. అనంతరం పర్యావరణ, భూగర్భ గనులు, పురపాలక శాఖ చీఫ్ సెక్రటరీలతో పాటు జిహెచ్ఎంసి కమిషనర్‌లను ప్రతివాదులుగా చేర్చింది. ఈ పేలుళ్లపై వెంటనే వివరణ ఇవ్వాల్సిందిగా వారికి నోటీసులు జారీ చేసింది.

# ఇక ఏ బ్యాంకు ద్వారానైనా పింఛను


## ఈపీఎస్-1995 సభ్యులకు జనవరి నుంచి అమలుఉద్యోగుల భవిష్య నిధి సంస్థ నిర్ణయం

దిల్లీ: సెప్టెంబర్ 04ప్రజావినికిడి: ఉద్యోగుల పింఛను సమస్యలు ఇక తీరిపోనున్నాయి. దేశంలో ఏ బ్యాంకు బ్రాంచి నుంచైనా పింఛను పొందేలా ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) ఏర్పాట్లు చేస్తోంది.ఈ విధానం వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి అమలులోకి వస్తుందని కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ బుధవారం వెల్లడించారు. ఉద్యోగ విరమణ తర్వాత నివాస ప్రాంతం మారినా నెలవారీ పింఛను పొందటానికి ఇకపై ఇబ్బంది ఉండబోదు. పింఛను చెల్లింపు ఆర్డర్లను బట్వాడా చేయాల్సిన అవసరం లేకుండానే ఈ విధానంలో చెల్లింపులు జరుగుతాయన్నారు. ఈపీఎఫ్ఓ నిర్వహణలోని ఉద్యోగుల పింఛను పథకం(ఈపీఎస్)-1995 సభ్యులకు ఇది వర్తిస్తుంది. కొత్త విధానం వల్ల 78 లక్షల మంది పింఛనుదారులకు ప్రయోజనం కలుగుతుంది.

## సుప్రీంకోర్టుకు చేరిన మథుర షాహీ ఈద్గా వివాదం

దిల్లీ:ప్టెంబర్ 04ప్రజావినికిడి:
మథురలోని శ్రీకృష్ణ జన్మభూమి-షాహీ ఈద్గా వివాదానికి సంబంధించి దాఖలు చేసిన 18 వ్యాజ్యాలను అలహాబాద్ హైకోర్టు తోసిపుచ్చడాన్ని సవాల్ చేస్తూ మసీదు నిర్వహణ కమిటీ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది.మసీదు నిర్వహణ కమిటీ వ్యాజ్యాలకు విచారణ అర్హత లేదని ఆగస్టు 1న హైకోర్టు తీర్పు వెలువరించింది. దీనిని సవాల్ చేసిన పిటిషన్ సుప్రీంకోర్టులో వచ్చే వారం విచారణకు వచ్చే అవకాశం ఉందని మసీదు నిర్వహణ కమిటీ తరఫు న్యాయవాది సికిందర్ బుధవారం దిల్లీలో వెల్లడించారు. షాహీ ఈద్గా మసీదుపై హిందువులు దాఖలు చేసిన వ్యాజ్యాలు ప్రార్థనా స్థలాల చట్టాన్ని ఉల్లంఘించేలా ఉన్నాయని పేర్కొంటూ మసీదు కమిటీ హైకోర్టులో పిటిషన్లు వేసింది. అయితే, షాహీ ఈద్గా నిర్మాణ ఆధారాలను పరిశీలించాల్సి ఉందంటూ హైకోర్టు వాటిని కొట్టివేసింది.

# రీడింగ్ గ్లాసెస్‌కు ఇక చెల్లు.. కంటి చూపు మందగించిన వారికి సరికొత్త ఐ డ్రాప్స్!




ముంబై, సెప్టెంబర్ 04ప్రజావినికిడి:
కంటిచూపు మందగించిన వారికి కళ్లద్దాల అవసరాన్ని దూరం చేసే కొత్త ఐ డ్రాప్స్ మార్కెట్‌లోకి రానున్నాయి. ముంబైకు చెందిన ఎన్టాడ్ ఫార్మాస్యూటికల్స్ అనే ఫార్మా కంపెనీ తయారుచేసిన ఈ ఐ డ్రాప్స్‌కు డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) ఆమోదం తెలిపింది.వయసు పెరుగుతున్న కొద్దీ కంటిచూపు మందగించే సమస్యను చాలా మంది ఎదుర్కొంటున్నారు. దీనినే ప్రెస్బియోపియా అంటారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 109 నుంచి 180 కోట్ల మంది ఈ సమస్యతో బాధపడుతున్నారు. సాధారణంగా 40 -45 ఏండ్ల వయసులో ఈ సమస్య మొదలవుతుంది. 60 ఏండ్ల వయసు వచ్చే నాటికి తీవ్రమవుతుంది.ప్రెస్బియోపియా ఉన్న వారికి దగ్గరి వస్తువులు సరిగ్గా కనిపించవు. ఏదైనా చదవాలంటే కళ్లద్దాలు తప్పనిసరి అవుతుంది. ఈ సమస్యకు చికిత్స చేసేందుకు 'ప్రెస్‌వు ఐ డ్రాప్స్'ను ఎన్టాడ్ ఫార్మాస్యూటికల్స్ అభివృద్ధి చేసింది. దీనిని సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్(సీడీఎస్‌సీఓ)కు చెందిన నిపుణుల బృందం సిఫార్సు చేయడంతో డీసీజీఐ తుది అనుమతి ఇచ్చింది. ఈ ఐ డ్రాప్స్ వేసుకోవడం వల్ల ప్రెస్బియోపియా బాధితులకు కళ్లద్దాల అవసరం తగ్గుతుందని ఎన్టాడ్ ఫార్మాస్యూటికల్స్ తెలిపింది. దీని ధర రూ.350 వరకు ఉంటుందని, అక్టోబరు మొదటి వారం నుంచి మార్కెట్‌లోకి అందుబాటులోకి తెస్తామని ప్రకటించింది.

# గ్రామాలకు 4కోట్ల సాయం



## తెలంగాణకు కోటి సాయం

**బురద జల్లే కార్యక్రమం మానండి**

**వీలైతే సహాయ కార్యక్రమాల్లో పాల్గొనండి**

**వైకాపా కార్యకర్తలు సమాయచర్యల్లో దిగాలి**

**విపత్తుల సమయంలో చంద్రబాబు అనుభవం పనికొస్తోంది**

**ఆయనలా కష్టపడడం ఎవరికీ సాధ్యం కాదు**

**వరదసహాయకచర్యలకు అంతరాయమనే తాను వెళ్లడంలేదు**

**తెలంగాణకు కోటి సాయం ప్రకటించిన డిప్యూటి సిఎం పవన్**

**అమరావతిసెప్టెంబర్ 04ప్రజావినికిడి:**
విపత్తు సమయంలో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. సిఎంగా చంద్రబాబు అనుభవం ఏంటో ఇప్పుడు తెలుస్తున్నదని అన్నారు. వైకాపా విమర్శలు ప్రస్తావిస్తూ..రాళ్లు వేయడం సులువని, పనిచేసేవారికి ఎంత కష్టపడుతున్నారో తెలుస్తుందని అన్నారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బుడమేరులోని 90 శాతం ఆక్రమణలే విజయవాడకు శాపంగా మారాయని పవన్ అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సీఎం చంద్రబాబు సమర్థంగా పనిచేస్తున్నారని కొనియాడారు. ఈ వయసులోనూ జేసీబీలు, ట్రాక్టర్లు ఎక్కి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్నారన్నారు. ఆయన్ను అభినందించాల్సింది పోయి విమర్శలు చేయడం సరికాదని వైకాపా నేతలను ఉద్దేశించి హితవు పలికారు. వైకాపా నేతలు ముందు సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని.. ఆ తర్వాతే ఆరోపణలు చేయాలన్నారు.



వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లడం లేదంటూ వైకాపా నేతలు చేస్తున్న విమర్శలపై పవన్ స్పందించారు. తాను వెళ్తే సహాయక చర్యలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. అధికార యంత్రాంగానికి ఒత్తిడి ఉంటుందని చెప్పడంతో తాను వెళ్లలేదని చెప్పారు. ఇంకా విమర్శించాలనుకుంటే వైకాపా నేతలు నాతో పాటు ఎక్కడికైనా రావొచ్చు. నా కాన్వాయ్‌లోనే తీసుకెళ్తాను. నాతో నడవండి.. ఎలా ఉంటుందో చూడండి. అప్పుడు మీరే సలహా ఇస్తారు. ఇది రాష్ట్ర సమస్య. వైకాపా నేతలు సహాయం చేసి మాట్లాడాలి. ఇళ్లలో కూర్చొని విమర్శలు చేస్తే సరిపోదని పవన్ వ్యాఖ్యానించారు. సహాయ కార్యక్రమాల్లో పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది పాల్గొంటున్నారని పవన్ తెలిపారు. 175 బృందాలు విజయవాడ అర్బన్‌లో పనిచేస్తున్నాయని అన్నారు. వరద ప్రభావం లేని జిల్లాల నుంచి వచ్చిన 900 మంది పారిశుద్ధ్య కార్మికులు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు వివరించారు. వరదలకు ఎక్కువగా ఎన్టీఆర్ జిల్లా దెబ్బతిందని తెలిపారు. 26 ఎన్డీఆర్ఎఫ్, 24 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు పనిచేస్తున్నాయని తెలిపారు. నేవీ నుంచి 2, ఎయిర్‌ఫోర్స్ నుంచి 4 హెలికాప్టర్ల ద్వారా ఆహార పంపిణీ జరుగుతోందని చెప్పారు.ఇదిలావుంటే బాధితులను ఆదుకోవడమంటే మాటలు చెప్పడం కాదని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిరూపించారు. ఏకంగా రూ.4 కోట్ల వరద సాయాన్ని ఆయన ప్రకటించారు. వరద ప్రభావిత గ్రామాలకు ఆయన ఈ విరాళం అందించారు. మొత్తం 400 గ్రామ పంచాయతీలు వరద ముంపు బారిన పడ్డాయని, ఒక్కో పంచాయతీకి ఒక లక్ష రూపాయల చొప్పున నేరుగా పంచాయతీ ఖాతాకు విరాళం పంపిస్తానని ప్రకటించారు. రూ.4 కోట్లు మొత్తాన్ని ముంపు గ్రామ పంచాయతీలకు అందించాలని నిర్ణయించుకున్నట్టు ఆయన తెలిపారు. ఇక తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. కోటి విరాళం అందించనున్నట్టు పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఈ మేరకు పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ వరద పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. వరద ప్రభావిత ప్రాంతాలలో నెలకొన్న పరిస్థితులు, గ్రామాలలో తాగు నీరు, ఆహారం సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం నేపథ్యంలో ఏలేరు జలాశయానికి వరద ముప్పు పొంచి ఉన్నందున ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు. ప్రజలకు నిత్యావసరాలు, ఆహారం, తాగు నీరు, ఔషధాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఏలేరు రిజర్వాయర్ పరిస్థితిపై ఆయన జిల్లా అధికార యంత్రాంగంతో మాట్లాడారు. లేరుకి వచ్చిన వరద నీరు, ఈ రోజు సాయంత్రం నుంచి నీటిని విడుదల చేయాల్సిన పరిస్థితులపై కలెక్టర్ వివరించారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకి ఏలేరు రిజర్వాయర్‌కి 20.2 టీఎంసీల నీరు చేరుకుందని, క్రమంగా నీరు వదలాల్సి ఉంటుందని వెల్లడించారు.

# 'అన్న' నిర్వాహకంతోనే విజయవాడకు ఈ దుస్థితి

## జగన్ పై విరుచుకుపడ్డ షర్మిల



విజయవాడ,సెప్టెంబర్ 04ప్రజావినికిడి: -
గత వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులు, బ్యారేజీలకు వార్షిక నిర్వహణ కూడా చేపట్టలేదని ఎపి పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల మండిపడ్డారు. కనీసం రాజశేఖరరెడ్డి హయాంలో నిర్మించిన ప్రాజెక్టులను సైతం గత జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. విజయవాడ ప్రకాశం బ్యారేజీ పై విరిగిన గేట్లను నేడు ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్ అన్న నిర్వాకంతోనే విజయవాడకు ఈ దుస్థితి ఏర్పడింటూ మండిపడ్డారు..నిర్వహణకు నిధులు విడుదల చేయకపోవడంతోనే పలు ప్రాజెక్టుల గేట్లు సైతం ఊడి.. నదులో తెలియాడాయని గుర్తు చేశారు.
కృష్ణా నదిపై నిర్మించిన ప్రకాశం బ్యారేజీ గేట్లు విరిగిపోయిన ఘటనలో బాధ్యులను కఠినంగా శిక్షించాలని షర్మిల డిమాండ్ చేశారు. ప్రకాశం బ్యారేజీ వద్ద కావాలనే పడవలను వదిలారా? అని సందేహం వ్యక్తం చేశారు. అందుకు బాధ్యులు ఎవరో గుర్తించి.. వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వానికి సూచించారు. ప్రకాశం బ్యారేజీకి ఎంతో ఘన చరిత్ర ఉందని గుర్తు చేశారు. అలాంటి బ్యారేజీ గేట్లు విరిగి పోయిన అంశాన్ని ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకోవాలని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ ఘటనకు బాధ్యులను కఠినంగా శిక్షించకుంటే.. భవిష్యత్తులో ఈ తరహా ఘటనలు చోటు చేసుకునే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ప్రకాశం బ్యారేజీ మరమ్మతు పనులు సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని ప్రభుత్వానికి సూచించారు.

## ఆర్టీసీ ప్రయాణికులు పదిశాతం డిస్కౌంట్

### విజయవాడ-హైదరాబాద్ రూట్‌లో వర్తింపు

హైదరాబాద్: సెప్టెంబర్ 04ప్రజావినికిడి: భారీ వర్షాలు, వరదలు తెలుగు రాష్ట్రాలను అతలాకుతలం చేస్తున్నాయి. దీంతో రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు సాగించే ప్రయాణికులు గత కొన్ని రోజులుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్-విజయవాడ మధ్య రాకపోకలు సాగించే ప్రయాణికులకు టికెట్ ధరలో 10 శాతం రాయితీ ఇవ్వనున్నట్టు ప్రకటించింది. రాజధాని, ఏసీ, సూపర్ లగ్జరీ బస్సులలో ఈ రాయితీ వర్తిస్తుందని తెలిపింది. ముందస్తు రిజర్వేషన్ కోసం టికెట్లు బుక్ చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచించారు. ఇదిలా ఉండగా.. ఇటీవల భారీ వర్షాల నేపథ్యంలో వరదలు పోటెత్తడంతో హైదరాబాద్ ? విజయవాడ మధ్య రాకపోకలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. దాదాపు 36 గంటల పాటు రాకపోకలు స్తంభించాయి. వరద ఉధృతి స్వల్పంగా తగ్గడంతో మళ్లీ రాకపోకలు మొదలయ్యాయి. ఈ క్రమంలోనే తెలంగాణ ఆర్టీసీ ప్రయాణికులకు టికెట్లపై రాయితీని ప్రకటించింది.

# దర్శకుడు హరీశ్‌శంకర్ పెద్దమనసు

## మిస్టర్ బచ్చన్ ఫెయిల్యూర్‌తో 2కోట్లు వాపస్

మాస్ మహారాజ రవితేజ, దర్శకుడు హరీశ్ శంకర్ కాంబోలో వచ్చిన తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్' 'నామ్ తో సునా హోగా' అనేది ఈ సినిమా ట్యాగ్‌లైన్. షాక్, మిరపకాయ్ వంటి సూపర్ హిట్ సినిమాల తర్వాత రవితేజ, హరీశ్ శంకర్ కాంబోలో ఈ సినిమా రావడంతో మూవీపై భారీ అంచనాలు ఉన్న విషయం తెలిసిందే. అయితే ఈ అంచనాలను అందుకోలేక పోయింది ఈ చిత్రం. ఇండిపెండెన్స్ కానుకగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాగా.. ఫస్ట్ షో నుంచే మిక్స్‌డ్ టాక్ రావడంతో బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ అందుకోవడమే కాకుండా.. సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోల్ అయ్యింది ఈ చిత్రం. అయితే ఈ సినిమాకు వచ్చిన నష్టాల వలన దర్శకుడు హరీశ్ శంకర్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. ఈ మూవీ వలన నష్టపోయిన నిర్మాతకు హరీశ్ శంకర్ తన రెమ్యూనరేషన్ నుంచి రూ.2 కోట్లు వెనక్కి ఇచ్చినట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఈ సినిమాకు హరీశ్ శంకర్ దర్శకుడిగా రూ.10 కోట్ల రెమ్యూనరేషన్ తీసుకున్నట్లు సమాచారం. ఇందులో నుంచే నిర్మాతకు రూ.2 కోట్లు తిరిగి ఇచ్చినట్లు టాక్. అయితే హరీశ్ శంకర్ చేసిన పనికి రవితేజ అభిమానులతో పాటు నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మించగా.. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించింది.





## దేవర నుంచి కొత్త పోస్టర్ విడుదల

ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'దేవర' జనతా గ్యారేజ్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత వీరిద్దరి కాంబోలో ఈ సినిమా రానుండటంతో భారీ అంచనాలు ఉన్నాయి. ఇక రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ నటుడు సైఫ్ అలీఖాన్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాను సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. విడుదల తేదీ దగ్గర పడటంతో వరుస అప్‌డేట్‌లను ప్రకటిస్తుంది చిత్రబృందం. ఇప్పటికే మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ ఫియర్ సాంగ్‌తో పాటు సెకండ్ సింగిల్ చుట్టమల్లే పాటలను విడుదల చేయగా.. ఈ రెండు పాటలు యూట్యూబ్‌లో దూసుకుపోతున్నాయి. అయితే తాజాగా ఈ మూవీ నుంచి థర్డ్ సింగిల్ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ మూవీ నుంచి థర్డ్ సింగిల్ 'దావుడి' సాంగ్‌ను ఈరోజు సాయంత్రం 5.04 గంటలకు విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది.




## మేఘా ఆకాష్ అందం.. ఏంజెల్ కంటే ఎక్కువే..

మెఘా ఆకాష్ తన వ్యక్తిగత జీవితంలో ఓ కొత్త అడుగు వేయబోతోంది. చాలా.కాలంగా ప్రేమలో ఉన్న ఈ బ్యూటీ ఎప్పుడు కూడా ప్రేమ విషయాన్ని బయటకు లీక్ చేయలేదు. ఇక ఆమె ప్రియుడు సాయి విష్ణుతో నిశ్చితార్థం జరుపుకుంది. ఈ కార్యక్రమం కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో జరిగింది. ఆ వేడుక తర్వాత అమ్మడు బ్యాచిలర్ పార్టీ కోసం శ్రీలంకకు వెళ్ళింది. మెఘా ట్రిప్‌కు సంబంధించిన అనేక ఫొటోలు సోషల్ మీడియాలో షేర్ చేస్తూ తన అభిమానులతో ఆనందాన్ని పంచుకుంటోంది. శ్రీలంకలోని ఆ అందమైన దీవిలో మెఘా చేస్తున్న సరదా ప్రయాణం అభిమానులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఆమె శ్రీలంకలోని అందమైన లొకేషన్స్ లో దిగిన ఫొటోలు వైరల్ అవుతున్నాయి. %ూశ్రీంశీ =ఘుస% - దేవర 'దావుడి' సాంగ్.. మాస్ విజిల్స్ పక్కా తాజాగా మెఘా ఆకాష్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫొటోలో, ఆమె ఒంటి మీద తెల్లని షోల్డర్ డ్రాప్ డ్రెస్ ధరించి ఎంతో అందంగా కనిపించింది. ఆ లుక్‌తో పాటు చేతిలో కోల్డ్ డ్రింక్, హెయిర్ స్టైల్‌కి చక్కగా సరిపోయే పూలతో మెఘా బ్రైడ్ మూడ్ లో ఉన్నట్లుగా కనిపిస్తుంది. మెరిసే చర్మం, గ్లామరస్ మేకప్ ఆమెకు మరింత అందాన్ని జోడించింది. ఈ ఫొటోలో మెఘా ఒక దేవతలా కనిపిస్తోందని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. మెఘా తన స్నేహితులతో కలిసి శ్రీలంకలో ఓ బ్యాచిలర్ పార్టీ కూడా ఎంజాయ్ చేసింది. ఆ ట్రిప్ లో కూడా చాలా సరదాగా గడిపిందని ఫొటోలు, వీడియోలు ద్వారా తెలియజేస్తోంది. ఇక మెఘా ఆకాష్ సినిమా కెరీర్ విషయానికి వస్తే.. తెలుగు ప్రేక్షకులకు "లై" మరియు "చల్ మోహన్ రంగ" వంటి చిత్రాల ద్వారా బాగా పరిచయం అయ్యింది. ఆమె తన నటనతోనే కాకుండా తన అందంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ప్రస్తుతం ఆమె వ్యక్తిగత జీవితంలో జరిగుతున్న ఈ మార్పులు ఆమె అభిమానులను మరింత ఆకట్టుకుంటున్నాయి. ఇక పెళ్లి తరువాత అమ్మడు మళ్ళీ సినిమాల్లో నటిస్తుందో లేదో చూడాలి. ఆ మధ్య ఒక వెబ్ సీరీస్ తో బిజీగా ఉన్నట్లు చెప్పింది. అలాగే రెండు సినిమాలు కూడా లైన్ లో ఉన్నట్లు వివరణ ఇచ్చింది. మరి ఆ ప్రాజెక్టులపై అప్డేట్స్ ఎప్పుడు వస్తాయో చూడాలి.

## శరవేగంగా గుడ్ బ్యాడ్ అగ్లీ మూవీ షూటింగ్



కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ తో పాన్ ఇండియా ప్రొడక్షన్ హౌస్ మైత్రీ మూవీ మేకర్స్ రూపొందిస్తున్న బి÷-గగెస్ట్ ఎంటర్‌టైనర్ చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ఈ తెలుగు-తమిళ ద్విభాషా చిత్రానికి అధిక్ రవిచంద్రన్ రచన, దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ మూవీ హైదరాబాద్‌లో శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన లుక్ పోస్టర్స్ మంచి స్పందనను రాబట్టుకోగా తాజాగా ఇంట్రెస్టింగ్ అప్డేట్ బయటకు వచ్చింది. అయితే.. ఈసినిమాలో ఇప్పటివరకు హీరోయిన్‌ను ఇంకా ఎంపిక చేయలేదు. ఈ నేపథ్యంలో తాజాగా ఈ మూవీ కోసం త్రిష(÷సతిబరజీ)ను ఎంపిక చేశారు. ఈ మేరకు ఒప్పంద పత్రాలపై సంతకాలు కూడా పూర్తి చేశారు. త్వరలోనే అజిత్ - త్రిష కాంబినేషన్‌లో తెరకెక్కించే సన్నివేశాలను షూట్ చేసేలా దర్శకుడు ఆధిక్ రవిచంద్రన్ ప్లాన్ చేస్తున్నారు.



## అందాల మీనాక్షికి అదృష్టం మొదలైనట్టే!

కథానాయికలకు ఉండవలసిన మొదటి అర్హత అందమే. ఆ తరువాత కొద్దిగా అభినయం తెలిస్తే సరిపోతుంది. అందంగా ఉన్న వాళ్లంతా కథానాయికలు కాలేరు. హీరోయిన్స్ గా ఎంట్రీ ఇచ్చిన వాళ్లందరూ స్టార్ డమ్ ను సంపాదించుకోలేరు. అందుకు అందంతో పాటు .. అభినయంతో పాటు అదృష్టం కూడా తోడుకావాలి. అలాంటి అదృష్టం మీనాక్షి చౌదరి కెరియర్లో అడుగుపెట్టినట్టుగానే కనిపిస్తోంది.మీనాక్షి చౌదరి ఎలాంటి హడావిడి లేకుండా తెలుగులో చేసిన మొదటి సినిమా 'ఇచ్చటవాహనములు నిలుపరాదు'. ఆ తరువాత రవితేజ సరసన ఆమె 'ఖిలాడీ' సినిమాలో మెరిసింది. ఈ సినిమా సక్సెస్ కాలేదు .. కాకపోతే ఆమె గ్లామర్ టచ్ ఆడియన్స్ కి గుర్తుండిపోయింది. ఆ తరువాత చేసిన 'హిట్ 2' సక్సెస్ ఆమెను మరో మెట్టు ఎక్కించింది. ఈ నేపథ్యంలోనే ఆమె 'గుంటూరు కారం' చేసింది. 'గుంటూరు కారం'లో మహేశ్ బాబు మరదలుగా మీనాక్షి కనిపించింది. ఈ సినిమాలో ఆమె పాత్రకి ఎలాంటి ప్రాధాన్యత లేదు. కానీ అంతకుముందు కంటే ఈ సినిమాలో ఆమె చాలా అందంగా కనిపించింది. ఆమెను మెయిన్ హీరోయిన్ గా తీసుకోవచ్చనే నమ్మకాన్ని కలిగించినది ఈ సినిమానే. ఏదో అలా నెమ్మదిగా పుంజుకుంటుందేమోనని అనుకుంటున్న సమయంలో ఆమె ఏకంగా విజయ్ సినిమా 'ది గోట్'లో హీరోయిన్ గా ఛాన్స్ కొట్టేసింది.మీనాక్షి కెరియర్లో ఇదే పెద్ద సినిమాగా చెప్పుకోవచ్చు. విజయ్ సినిమాలో హీరోయిన్ గా ఛాన్స్ రావడమనేది అంతతేలికైన విషయమేం కాదు. రేపు ఈ సినిమా భారీ స్థాయిలో విడుదలవుతోంది. ఈ సినిమా హిట్ కొడితే మీనాక్షి గ్రాఫ్ ఒక రేంజ్ లో పెరిగిపోవడం ఖాయం. విష్వక్ జోడీగా ఆమె చేసిన 'మెకానిక్ రాకీ' .. వరుణ్ తేజ్ సరసన చేసిన 'మట్కా' కూడా అక్టోబర్లో విడుదల కానున్నాయి. ఈ సినిమాలతో మీనాక్షి నెక్స్ట్ లెవెల్ కి వెళుతుందనే అనిపిస్తోంది మరి.

## హేమ కమిటీ రిపోర్ట్ గురించి అడక్కండి :ఆండ్రియా జెర్మయ్య




మలయాళ చిత్రపరిశ్రమలో అవకాశాల పేరుతో 'అడ్జెస్ట్‌మెంట్'పై జస్టిస్ హేమ కమిషన్ ఇచ్చిన నివేదికపై తనను ప్రశ్నించవద్దంటూ సింగర్, హీరోయిన్ ఆండ్రియా జెర్మయ్య స్పష్టంచేశారు. తిరువాన్మియూరులో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో ఆమె పాల్గొంది. ఈ సందర్భంగా ఆమెను మీడియా జస్టిస్ హేమ కమిషన్‌పై ప్రశ్నలు సంధించింది. దీనికి ఆండ్రియా జెర్మయ్య సమాధానమిస్తూ, చిత్రపరిశ్రమలో మహిళల లైంగిక వేధింపులపై జస్టిస్ హేమ కమిషన్ ఇచ్చిన నివేదికపై నో కామెంట్స్, ఈ అంశంలో ఎలాంటి ప్రశ్నలు అడగొద్దు' అంటూ కోరారు. నిజానికి ప్రతి అంశంలో ఎంతో బోల్డ్‌గా స్పందించే నటి ఆండ్రియా.. జస్టిస్ హేమ కమిషన్‌పై మాట్లాడేందుకు నిరాకరించడం ఇపుడు చర్చనీయాంశంగా మారింది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613